

# ముత్యాల ముక్కుపుడక

చల్లని సాయంకాలం. ఉల్లాసంగా రెక్కలు విప్పిన పిల్లగాలి. గేటుకూ వరండాకూ మధ్యన చిన్న లాన్. లాన్ చుటూరా పూలమొక్కలు. మొక్కల నలంకరించిన పూబాలల చెక్కిళ్లను నాజూగ్గా స్పర్శిస్తోందా పిల్లగాలి. ఒంటినిండా పులకింతలు పులుముకు పోయిన పూబాలలు రేకులు విప్పి నవ్వేస్తున్నై.

మొక్కల నడుమ చక్కని దృశ్యం.

పూలలో పూవైన పూబోణి... అపర్ణ.

సన్నని నడుము, నున్నని ఒళ్లు, ఎర్రని బొట్టు, చారెడేసి కళ్లు, బారెడు జడ.. అంతా కలిసి ముగ్ధమోహన సౌందర్యం.. కేన్‌బాటం కుర్చీలో జేరగిలబడింది. చూపులు మందారమ్మీద నిలిచిపోయినై.

తనలాగే అదిగూడా పూర్ణవికసిత, మందస్మిత.. ప్రియుని రాకకోసం ఎదురు చూస్తున్న ఎలనాగ.

అదో... వచ్చేసింది.. నల్లని రెక్కలు పూర్తిగా విప్పుకుని - కొల్లగొట్టాలని వచ్చిందో గండు తుమ్మెద. మందార సుందరిఒడిలో వాలింది.. ఆహా... జుర్రుకుంటోంది..

అపర్ణ ఒంటినిండా వింత పులకింతలు. ప్రియుని కౌగిట్లో కరిగిపోతున్న తమకం. చెంపల మీది సిగ్గుల కెంపులను పెదాలతో ఏరుకుంటున్న గగుర్పాటు. అరచేతుల్తో చెంపల్ని తడుముకుంది. వెచ్చని... నులి వెచ్చని అనుభూతి. తనలోతానే నవ్వుకుంది.

ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్.. ఫోన్ పిలుపు.

దబుక్కున లేచి గబుక్కున అడుగువేయబోయింది. వెనుకనుండెవరో కొంగు లాగుతున్నారు.

"అమ్మదొంగా ! పిల్లిలా వచ్చి కళ్ళుమూయాలనీ ! అదేం కుదరదు బాబూ !"

గిరుక్కున వెనుదిరిగింది. ప్చ్.. అతడు కాదు. కొంగు అంచు పూలకొమ్మకు చిక్కింది. గుండెగూటిలో సిగ్గు చిలక కిలుక్కుమంది.

"హలో ... హలో ... ఎవరూ ?"

"నేను... నేను... అపర్ణా... నీ నటేశ్వర్‌ను.."

మూణ్నెల్ల క్రితం... మునివేళ్లను తన మెడమీద నాట్యమాడిస్తూ మూడు ముళ్లేసి, ఏడడగులు నడిపించిన తోడూ నీడా. కాళ్లు కడిగి కన్యాదానం చేసేప్పుడు - అమ్మా నాన్నా అన్నయ్యల్లో పొంగిన అష్టమ సముద్రాన్ని తేనెల మాటలతో కుంగదీసిన చతురుడు... తననీ మెగాసిటీకి తరలించిన మొనగాడు. ఇంటికొచ్చి కొంగు లాగాడను కుంటే ఇలా ఫోన్‌లో ప్రత్యక్షమయ్యాడు.

"ఐదు... అప్పుడే ఐపోయింది. మీకోసమే ఎదరు చూస్తున్నా. రెక్కలు కట్టుకు వచ్చేయండీ" గారాల బాలైంది.

"అలా రావడానికి మా కంపెనీ కారేమన్నా హైటెక్ విమానమా?" సన్నని నవ్వు.

వెన్నపూసకు తాజా వెన్నరాసినట్టుంది. పడుచుదనంలోని గడుసుదనం పకపకా నవ్వింది.

"జాతీయస్థాయి కంపెనీలో అంతర్జాతీయ ఎగుమతుల అధికారికో విమానం

ఏర్పాటు చెయ్యడంలో కష్టమేమిటటా!"

"కష్టమో నష్టమో గానీ... " గొంతులో గాంభీర్యం "దేవిగారో గంటలో హోటల్ కృష్ణా ఒబెరాయ్ కొచ్చెయ్యాలి".

"ఎందుకండీ వృధాఖర్చు. కంపెనీ ఇచ్చిన ఈ క్వార్టర్స్‌లో వసతులన్నీ ఉన్నయ్. ఇది వెల్ ఫర్నిష్డ్ హౌజ్ గదా... ఇంకా హోటల్ రూమ్‌లో ఎందకుండీ... దుబారా!" ముక్కుమీద వాలిన ఈగను కసిగా తోలింది.

"హయ్యో.. ఆశ ! నిన్ను హోటల్‌కు రమ్మంది ప్రణయ కలాపానిక్కాదు అపర్ణా, పార్టీకి. ఈరోజు ఓ అమెరికా కంపెని మా కంపెనీకి మధ్య పెద్ద ఒప్పందం కుదిరింది. దాన్ని సెలబ్రేట్ చేస్తున్నాం. అంతేగాని ఇది మన సమాగమానికి శుభముహూర్తం కాదు."

అతని చిరునగవుల సరిగమలు అపర్ణపెదాల పాలిట పదనిసలైపోయినై.

"ఛీ... సిగ్గులేదూ... !"

"సిగ్గూ, బొగ్గుల సంగతి ఫోన్‌లో ఎందుగ్గానీ... సరిగ్గా ఏడింటికి పార్టీ, నువ్వు చక్కగా తయారై ఎంచక్కా వచ్చెయ్. మరోమాట... ఈ పార్టీకి ఫారిన్ డెలిగేట్స్ ఫామిలీస్‌తో వస్తున్నారన్న సంగతి గుర్తుంచుకోవాలి సుమా !"

"ఓహో ! ఐతే.. ఏ పట్టుచీర కట్టుకురావాలో..."

"పట్టుచీరా, పుట్టెడు నగలతో హాజరయేందుకిదేమన్నా పెళ్లా, పేరంటమా ? సింపుల్ అండ్ స్వీటుగా రావోయ్... ఉంటా."

సింపుల్ అండ్ స్వీట్ అంటే... ఎలాగబ్బా ! - ఆలోచనలో పడిపోయింది.

పూలమీది దృష్టి పెయింటింగ్స్ వైపు మళ్లింది.

రాధామాధవులు.. ప్రేమ పురాణానికి నాయకీ నాయకలు... ప్చ్... వాళ్లదంతా విప్రలంబ శృంగారం.

లక్ష్మీనారాయణులు... లక్షణంగా ఉన్నారుగాని వాళ్ల ప్రేమకేమంత ఫైలుందనీ !

పార్వతీ పరమేశ్వరులు... ఆహా... ఓహో !

వాగర్ధావి సంపృక్తౌ, వాగర్ధ ప్రతిపత్తయే...

జగతా పితరౌ వందే... పార్వతీ పరమేశ్వరం...

పార్వతీ పరమేశ్వరులు అమలిన శృంగారానికి ఆది దేవతలు. తపస్సు చేసి పరీక్షలో ఫస్ట్‌గా పాసై నాగభూషణుని సగం దేహాన్ని సగర్వంగా పంచుకున్న హైమవతి... అపర్ణ. సింపుల్ సిటీకి చిరునామా... ఎంత అందంగా ఉందో... క్లూ దొరికింది.

ఆరుబిళ్లల రాళ్లనెక్లెస్ - అబ్బో .. కదిలే నగల షాపంటారు. మూడు వరుసల చంద్రహారం.. ఊహు ! భారీగా ఉంది. మామిడి పిందెల ఒంటిపేట గొలుసు.. దానికి చిన్నసైజు నవరత్నాలు పొదిగిన లాకెట్. నవరత్నాలు నవరసాలకు ప్రతీకలు... బాగుంది.

చెవికమ్మలు.. అబ్బో... వద్దు.

జూకాలు.. ఆ.. ఓకే.

ముక్కుకో - ఒంటిరాయి ముక్కుపుడక... అబ్బే అసలే కనబడదు.

అరెరే... దీన్ని మరచిపోయానే ! మూడు రంగుల చిన్నరాళ్ళు పొదిగిన మూడు చిట్టిముత్యాలు వెలాడదీసిన ముక్కుపుడక... ఎంత ముద్దొస్తుందో ! - నానమ్మ పెళ్లికి వాళ్ల నానమ్మ వెరైటీగా ఉండాలని చేయించిందట. తన పెళ్లికి ముందు నానమ్మ తనకు బహుకరించింది. తరాలు మారినా వన్నె తరగని మువ్వన్నెల ముత్యాల ముక్కు పోగు.. ఆ కాలంలో ఆధునీకరించిన ముక్కుపుడక.. పెళ్లి కూతురుగా తయారవుతున్నప్పుడు.

"దీన్ని ముఖ్యమైన సందర్భాల్లో మాత్రమే అలంకరించుకో అపర్ణా" అని అల్లారు ముద్దుగా నుదురు ముద్దాడి, వీపునిమిరి స్వయంగా తన ముక్కుకు అలంకరించింది నానమ్మ. పండు ముదుసలి, పూర్ణ సువాసిని... నానమ్మ కళ్లలో కదలాడింది ! ఎద పొంగింది.

నానమ్మా ! నువ్విప్పుడేం చేస్తున్నావో ఏమో గాని నేను మాత్రం నీ ముక్కుపుడక నలంకరించుకుంటున్నానే.. గుండెల్లోని రసమాధుర్యం చెంపలమీదికి పాకి చెమ్మా చెక్కలాడింది.

పోచంపల్లి కాటన్ చీర మీద ఫుల్ చేతుల పూల జాకెట్టు. మ్యాచింగ్ సూపర్. బ్రాడ్‌గేజి పట్టాల మీద ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లా - ఉత్సాహం ఉరకలేసింది.

కృష్ణాఒబెరాయ్ - అంతర్జాతీయ యాత్రికులకు అత్యంత ప్రియమైన హోటల్. రకరకాల పూలమాలలు, రంగు రంగుల విద్యుద్దీపాలు... ఆధునికంగా అలంకరించిన హాలు - చుక్కలు పొదిగిన ఆకాశం లాగుంది. రాకెట్ నాగరికత నీడలో ఫ్యాషన్ల పరాకాష్ట. ఆడామగా తేడాలేదు. అందరూ అలంకృతులే. జంటలు జంటలుగా తిరుగుతున్నారు.

టైట్‌పాంట్, ఇన్‌షర్ట్‌లో దాగలేని ఎత్తైన వక్షస్థలంతో మత్తుగా తచ్చాడుతున్న యువతీమణులు, పూబొమ్మల నాకర్షించడమే పరమాధిలా... గండుతుమ్మెదల్లాంటి గడుసు యువకిశోరాలు.. ఉల్లిపొర చీరమీద స్లీవ్‌లెస్ జాకెట్‌తో సుందరాంగులు... మాయాలోకంలో అడుగుపెట్టినట్లుంది అపర్ణకు.

"వెల్‌కం.. వెల్‌కం ఆంటీ.." జూలో జంతువును పలుకరించినట్టు - గుండెల మీద వేళ్లాడుతున్న మంగళసూత్రాలను ఎగాదిగా చూస్తూ షేక్‌హాండివ్వబోయాడో మోడ్రన్ యువకుడు.

చెంపమీద చిటికేసి, మూతులు తిప్పుతూ వెళ్లిపోయిందో బాబ్డ్‌హెయిర్ మిడ్డీబేబీ.

"స్వాగతం... సుస్వాగతం పిన్నీ" జీన్‌పాంటు జవ్వని కనుబొమ్మ లెగిరిపడినై. సన్నని పెదాల నున్నని లిప్‌స్టిక్ మీద విద్యుత్తు వెలుగుల పరావర్తనం.

"నమస్తే ... థాంక్యూ" చేతులు జోడించింది అపర్ణ. లోలోపల ఆందోళన. ఆవేదన... నేను, నేను ఆంటీనా ? ... పిన్నినా ! ఇదేం సంబోధనా ?"

"వచ్చావా అపర్ణా..రా!" బాణంలా దూసుకొచ్చి చెయ్యిపట్టుకు లాక్కెళ్లాడు నటేశ్వర్.

"సార్... దిసీజ్ మై బెటరాఫ్... అపర్ణ" నడి వయసు జంట ముందు నటేశ్వర్ పరిచయ వాక్యాలు.

"వీరు మా యం.డీ. గారు అపర్ణా. వారేమో..."

"యం.డీ. గారి బెటరాఫ్ గారు గదూ ! నమస్తే.." అపర్ణ మందహాసం.

"ఓఫ్.. మార్బుల్ స్టాచ్యూలాగుందే !" యం.డీ. భార్య కళ్లు చేటలైపోయినై... "రోజ్ కలర్ శారీ, జరీ బార్డర్, నిండు చేతుల జాకెట్టూ.. వీపు మీంచి నల్లనాగు జడ నడుము దాటిందే.. బ్యూటీఫుల్..." కనుబొమ్మలు పీటముడేసుకున్నై "ఆ ముత్యాల ముక్కుపోగు అమ్మమ్మ అలంకరణలాగుంది గదా నటేశ్వర్" స్లీవ్‌లెస్ జాకెట్టు మీంచి జారిపడుతున్న సిల్క్‌కొంగును - జబ్బలు స్పష్టంగా కనబడేలా సవరించుకుంది. ముక్కు మూడు వంకర్లు తిప్పుతూ పక్కకు తప్పుకుంది.

"వెరీవెల్ మిస్టర్ నటేశ్వర్!" యం.డీ. భుజాలెగిరిపడినై. "ఆ నోస్ ఆర్నమెంటు ఏ సంచరీదటా?"

తల కొట్టేసినట్లైంది నటేశ్వర్‌కు.

ఛీఛీ.. పరువు పాత బజారు పాలైంది. దానిక్కారణం ఈవిడే. ఓ పెడరసం చూపు పెళ్లాం మీద వాలింది. బలవంతపు చిరునవ్వు పెదాలమీదాడింది.

"సెంచరీ సంగతి తెలీదు గాని సెంట్‌మెంట్‌తో ముడిపడిందిదసార్!"

"ఓ.కే. కమాన్. అంతా వచ్చేశారు. లెటజ్ స్టార్ట్ ది పార్టీ"

"ఓ.కే. సార్ !"

యం.డి. కదిలి ముందుకెళ్లాడు. నటేశ్వర్ భార్య చెయ్యందుకున్నాడు.

"ఏంటి అపర్ణా ! ఇలాంటి పార్టీకొచ్చేప్పుడు అలంకరణ గురించి బాగా ఆలోచించాలి గదా !"

"బాగానే ఆలోచించాను" అపర్ణ గొంతులో ఆవేదన. తప్పులేకున్నా దెప్పుల పాలవుతున్నందుకు ఏడుపొచ్చినంత పనైంది. "మన... బబ... బంధువులంతా ఈ ముక్కుపుడక చాలా బాగుందన్నారు గదా ! మా నానమ్మకూ... వాళ్ల నానమ్మ..."

"ఏమన్నా అంటే నానమ్మంటావు .. సరే.. పదా!"

"మీ యం.డి. గారు ఈ దేశస్తుడేనా !" ఏదో గుంజాటన ఎదను తొలిచేస్తుంది.

"ఔను... అతని భార్య గూడా... ఇద్దరూ సెంట్‌పర్సంట్ ఇండియన్సే."

"హలో నటేశ్వర్ ! ఎవరీ శ్రీ డీ ముక్కుపుడకా!"

ఫారిన్‌లో సెటిలై చుట్టం చూపుగా వచ్చిన బాల్య స్నేహితుడు భుజం తడిమాడు.

"ఓహ్ ! నీకు పరిచయం చెయ్యలేదు గదూ ! ఈవిడ నాభార్య... అపర్ణ."

"ఐసీ !... దిసీజ్ రోజీ. మైవైఫ్ అండ్ లైఫ్ ఆల్సో. ఆరిజనాఫ్ లండన్." పక్కనున్న చక్కని చుక్కను పరిచయం చేశాడు.

"వెరీఫైన్! " తేనె కళ్ల రోజీమొహం రోజాపూవులా విచ్చుకుంది. ఎక్స్‌రే చూపులు అపర్ణనాపాద మస్తకం స్పృశిస్తున్నై.

"నమస్తే..." చేతులు జోడించిందావిడ.

"మా ఫాదర్ ఇండియన్. ఆరిజనాఫ్ హైదరాబాదు. అన్షియెంట్ ఇండియన్ సిస్టమ్స్ చాలా బాగుంటాయి. ఐలైక్ వెరీమచ్. యూ ఆర్ లక్కీ పీపుల్.." జారిపోతున్న కొంగును జబర్దస్తీగా ఆపేసి భుజాల నిండుగా సవరించుకుంది.

రెండు జంటలు నిండుగా నవ్వాయి. నాలుగు కోణాల నవ్వుల అంతర్యాలను గ్రహించిన రంగు దీపాలు తమలో తామే నవ్వుకుంటున్నై.

"యువర్‌టెన్షన్ ప్లీజ్.." మైక్‌లో యం.డీ. గొంతు. ముచ్చట్ల ముసుర్లతో హోరెత్తిన వాతావరణం ప్రశాంతంగా మారింది. అందరి దృష్టి వేదికనలంకరించింది.

"వీరు... మిస్టర్ ఆర్క్. అమెరికన్ ప్రతినిధి" పక్కనున్న యువకుడి చేతిని పైకి లేపి చెబుతున్నాడు... నా అనుభవములో ఇంతటి ఇంటిలిజెంట్ చాప్‌ను చూళ్లేదు. హీ ఈజ్ వెరీ డాషింగ్ అండ్ డేరింగ్ పర్సన్. కోట్ల రూపాయల అగ్రిమెంటు కుదర్చడంలో తమ కంపెనీ తరపున మాతో ఎన్నోసార్లు చర్చలు జరిపి విజయం సాధించిన అపర భగీరథుడు" ఆ పక్కనున్న యువతిని చూపిస్తూ "వారు మిసెస్ లోటస్. ఆర్క్ గారి శ్రీమతి. వారిద్దరూ మన పార్టీలో పార్టిసిపేటవడం పరమానందంగా ఉంది. లెటజ్ ఎంజాయ్.. దిస్ అకేషన్.. థాంక్యూ.."

సన్నని సంగీతం పార్టీకి ప్రాణం పోసింది.

బఫే సిస్టమ్. పదార్థాలన్నీ టేబుళ్ల మీద రెడీ. ఎవరికిష్టమైనవి వారు వడ్డించు కోవచ్చు. తినొచ్చు. తాగొచ్చు.

యం.డీ. గార్కి నటేశ్వరంటే ఎంతో అభిమానం. అతని తెలివితేటల మీద బోలెడంత విశ్వాసం. అతని చాకచక్యమే ఈ అగ్రిమెంటు కుదిర్చిందని గూడా తెలుసు.

"మిస్టర్ నటేశ్వర్!" ఆర్క్ దంపతుల్ని నటేశ్వర్ కప్పగించి, "వీరితో మీరుండండి." అని ముందుకు కదిలాడు.

"దిసీజ్ మై వైఫ్ .. అపర్ణ" నటేశ్వర్ చిరునవ్వులు ఆర్క్ దంపతుల నలరిచినై.

"నమస్తే .. " అపర్ణ పెదాలు అలవోకగా కదిలినై.

"మిష్టర్ నటేశ్వర్ ! మై ఒరిజినల్ నేమ్ ఈజ్ అర్క.. దటీజ్ సూర్య"

"అయామ్ లోటస్. దటీజ్ పద్మం" అపర్ణ కళ్లలోకి చూసింది.

సూర్యకిరణాల స్పర్శకోసం పరితపించే పద్మం... పద్మం కోసం పరుగులతో ఉదయించే సూర్యుడు.. ఓహో !

"మీ జంట చూడ ముచ్చటగా ఉందండీ !" అపర్ణలో ఉత్సాహం ఉబికొచ్చింది. "అన్నట్టూ డూయూనో తెల్గూ మేడమ్?"

"మేము ఇండియాకు, స్పెషల్లీ ఏ.పి.కి ఫ్రీక్వెంట్‌గా రావాలి కాబట్టి అమెరికాలోనే తెలుగు నేర్చుకున్నాం.. బట్ నాట్ ఫర్‌ఫెక్ట్." లోటస్ నవ్వులో నయాగరా లయ ఉంది.

"ఇండియా... వీ లైక్ వెరీమచ్... ఇక్కడి ఫ్యామిలీ సిస్టంకో స్పెషాలిటీ ఉంది. అది మోడరన్ వరల్డ్‌కాదర్శం" లోటస్ నవ్వులో శృతి కలిపాడు ఆర్క్.

"థాంక్యూ.. థాంక్యూ సర్!" నటేశ్వర్ ఛాతి నాలుగంగుళాలు వెడల్పైంది గర్వంతో. "మిస్టర్ నటేశ్వర్ !" లోటస్ అంతరంగ తరంగాలు గంతులేస్తున్నై. "మేము ఇండియా అంతా టూర్ చేశాం. అటు వైష్ణవి నుండి ఇటు కన్యాకుమారి దాకా అన్నీ విజిట్ చేశాం. స్పెషల్లీ.. అమ్మవారి.. దటీజ్ గాడెస్ విగ్రహాలు మమ్మల్ని వండర్ చేశాయి. ఆ అమ్మవార్ల అలంకరణ వెరీ వ్వెరీ బ్యూటీఫుల్ అండ్ అట్రాక్టివ్. దటీజ్ ది మిర్రరాఫ్ ఇండియన్ కల్చర్ గదా ! కాని... ఆ అమ్మవార్ల కున్న ముక్కుపుడక ఎవరి నోస్ మీద కనబడుతుందా అని సర్చ్ చేస్తున్నాం. మాడమ్ అపర్ణ ఈజ్ క్వైట్‌రైట్. షీ ఈజ్ లైక్ గాడెస్ అపర్ణ. వీ మస్ట్‌బీ ప్రౌడాఫ్‌హర్..." నటేశ్వర్ భుజం తట్టింది.

"మూడు కలర్ల డైమండ్స్... మూడు స్మాల్ ముత్యాలు.. రియల్లీ సింబలాఫ్ బ్యూటీ" ఆర్క్ పొంగిపోయాడు.

చేతుల్లో ప్లేట్లతో కొందరు, డ్రింక్స్‌తో మరికొందరు.. చుట్టూ చాలామంది మూగారు. ఆసక్తిగా చూస్తున్నారు.

"ఇఫ్ యూ డోంట్ మైండ్." ఆర్క్ దృష్టి అపర్ణముక్కుమీదుంది. "మా లోటస్‌గ్గూడా అలాంటిదొకటి చేయించిపెట్టరూ!"

"ఐటూ వాంటిట్." అపర్ణ భుజం తట్టి అడిగేసింది రోజీ. కోకోకోలా బాటిల్ పక్కన పెట్టేసింది.

మత్తు ఎవ్వరినీ ఆవహించలేదింకా.

జీన్ పాంటు జవ్వని మనోనేత్రం తెరుచుకుంది.

"అలాంటి ముక్కుపుడక నాక్కూడా కావాలి డియర్!" పక్కనున్న బెటరాఫ్ చెవిలో ఊదేసింది.

"అది నీగ్గూడా బాగుంటుంది రమా !" కొత్త పెళ్లాం కళ్లల్లోకి చూశాడు కొత్తమొగుడు రమేష్.

"మూడు డైమండ్స్... మూడు ముత్యాలు.." బాబ్డ్‌హెయిర్ బేబీగుండెల్లో గుటకలు...

"ఓఫ్.. చాలా బాగుందే.."

ఇదంతా ఎక్కడినుండి గమనిస్తున్నారో యం.డీ. దంపతులు.

"మిస్టర్ నటేశ్వర్ !" యం.డీ. నటేశ్వర్ చెయ్యందుకున్నాడు. "ఇటీజ్ వెరీ అట్రాక్టివ్. నా భార్య గూడా కావాలంటుంది" కరచాలనం చేశాడు.

నటేశ్వర్ ఎద వేదికమీద ఆనందతాండవ నృత్యం.

☆ ☆ ☆

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక

18 ఫిబ్రవరి, 1999